నమస్తే తెలంగాణ

# ఖమ్మం

5 | ఖమ్మం, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | KHAMMAM


- గుండెపోటుతో పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి
- శోకసంద్రంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజానీకం
- వేలాదిగా తరలివచ్చిన ప్రకృతి ప్రేమికులు
- సంతాపం వ్యక్తం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, కేంద్రమంత్రులు
- నివాళులర్పించిన మంత్రి తుమ్మల, ఎంపీ రఘు రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ, అదనపు కలెక్టర్లు
- నేడు రెడ్డిపల్లిలో రామయ్య అంత్యక్రియలు

# ఆగిన ఆక్సిజన్!

## నింగికేగిన వన ప్రేమికుడు

*పర్యావరణ పరిరక్షణ కోసం నడుం బిగించాడు. దీనికి పచ్చని మొక్కలతోనే పరిష్కారం లభిస్తుందని నిర్ణయించుకున్నాడు. మొక్కకు విత్తే ప్రధానమని భావించాడు. ఎండిన గింజలను భారీ వృక్షాల కింద పొద్దంతా కూర్చొని సేకరిస్తూ.. పోగు చేస్తూ వాటిని రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో నాటడమే పనిగా పెట్టుకున్నాడు. విత్తడమే కాదు.. ఆ విత్తనానికి రోజూ నీరందిస్తూ కంటికిరెప్పలా కాపాడుకున్నాడు. ఆ విత్తనం మొలకెత్తిందే తడవుగా పురిట్లో బిడ్డను సాకినట్లుగా సాకాడు.. మొక్క ఏపుగా ఎదుగుతున్నకొద్దీ మురిసిపోయాడు. వాటికి రక్షణ కవచాలు ఏర్పాటు చేశాడు. అవి పచ్చదనాన్ని పంచుతూ.. బాటసారులకు నీడనిస్తుంటే మురిసిపోయాడు. ప్రజలు చెట్ల కింద సేదతీరుతుంటే తానే గొడుగు పట్టినట్లు భావించాడు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోటికిపైగా మొక్కలు నాటి.. వాటిని మహావృక్షాలను చేసి 'వనజీవి' అయ్యాడు. ఆయన కష్టానికి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 'పద్మశ్రీ'తో సత్కరించింది. ఆ అవార్డుతో ఆగిపోకుండా వయసు మీదపడినా మరింత ఉత్సాహంతో ప్రాణమున్నంత వరకు మొక్కలకు ప్రాణం పోయడమే తన పనిఅంటూ బాటసారిలా సాగిపోతున్నాడు. ఆయన తుదిశ్వాస విడిచివెళ్లడంతో ఆక్సిజన్ ఆగిపోయినంత పని అయ్యింది. ఇక తమకు దిక్కెవరని ఆయన నాటిన మొక్కలన్నీ కన్నీరు కారుస్తున్నాయి. మళ్లీ రావయ్యా.. రామయ్య అంటూ పిలుస్తున్నాయి.*

*- ఖమ్మం రూరల్, ఏప్రిల్ 12*



వనజీవి రామయ్య (ఫైల్)

పచ్చదనమే ప్రాణంగా.. మొక్కలను నాటి పెంచడమే తన జీవిత ఆశయంగా పెట్టుకొని కడవరకు వృక్షోరక్షతి రక్షితః అని నినదించిన హరిత ప్రేమికుడు పద్మశ్రీ దరిపెల్లి రామయ్య(వనజీవి రామయ్య)(87) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. ఖమ్మంజిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వనజీవి రామయ్య మృతితో ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. మరణానికి ఒక్కరోజు ముందు సైతం తన దైనందిన కార్యక్రమంలో భాగంగా విత్తనాలు సేకరించి ఇంటికివచ్చిన రామయ్య తన స్వగృహంలో రాత్రివేళ భోజనం చేసి పడుకున్నారు. నిత్యం తెల్లవారుజామున ఐదుగంటలకు లేచే అలవాటు ఉన్న రామయ్య లేవకపోయేసరికి అతని భార్య జానకమ్మ అనుమానంతో దగ్గరికి వెళ్లి చూడగా నిస్సహాయస్థితిలో ఉన్నాడు. దీంతో ఇంటిపక్కన వాళ్ల సహాయంతో హుటాహుటిన ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. రామయ్యను పరిశీలించిన వైద్యులు గుండెపోటుతో అప్పటికే మృతిచెందినట్లు తేల్చారు. రామయ్య భౌతికకాయాన్ని తిరిగి రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న తన ఇంటికి కుటుంబ సభ్యులు తరలించారు. పచ్చటి చెట్టు ప్రాణం విడిచింది అనే వార్తలు ఒక్కసారిగా సోషల్‌మీడియా, మీడియా ప్రచార సాధనాల ద్వారా విషయం తెలుసుకున్న ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఒక్కటికాదు.. రెండుకాదు ఏకంగా 50యేండ్ల నుంచి మొక్కల పెంపకం చేపట్టి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న రామయ్య మరణవార్తతో ఆయన అభిమానులు, ప్రకృతి ప్రేమికులు భావోద్వేగానికి లోనయ్యారు. వనజీవిని కడసారి చూసేందుకు అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు పెద్దఎత్తున రెడ్డిపల్లికి క్యూ కట్టారు. భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళ్లు అర్పించారు. రామయ్య మనుమలు ఇతర రాష్ట్రాల్లో ఉన్నందున వారిరాక అనంతరం ఆదివారం రెడ్డిపల్లి గ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయి.

### రామయ్య కుటుంబ నేపథ్యం..

మధ్యతరగతికి చెందిన దరిపెల్లి లాలయ్య-పుల్లమ్మ దంపతులకు 1937 జూలై 1వ తేదీన రామయ్య జన్మించారు. 87 ఏండ్ల వయస్సు కలిగిన రామయ్య సుమారు 50 ఏళ్లుగా విత్తనాలు సేకరించడం, మొక్కలను పెంచడమే వృత్తిగా పెట్టుకొని జీవన ప్రయాణం సాగిస్తున్నారు. రామయ్య-జానకమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమారులు చనిపోయారు. ఇంట్లో అనేక విషాదకరమైన సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ మొక్కవోని దీక్షతో ఒక్కటి కాదు.. రెండు కాదు ఏకంగా కోటి మొక్కలు నాటి వనజీవి యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచారు. దీంతో రామయ్య కృషికి ఫిదా అయిన కేంద్ర ప్రభుత్వం 2017 సంవత్సరంలో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. ఖమ్మంరూరల్ మండలంలో ప్రధాన రహదారుల వెంట ఉన్న ఏ చెట్టును చూసినా వనజీవి రామయ్య గుర్తుకు వస్తాడు అని చెప్పడంలో ఎంతమాత్రం సందేహం లేదు. ఆరునెలల క్రితం ఖమ్మం-మహబూబాబాద్ ప్రధాన జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా రామయ్య నాటిన చెట్లను కూల్చివేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా వాటిని సంరక్షించుకునేందుకు ఆయన అనేకమంది అధికారుల చుట్టూ తిరిగి ప్రాధేయపడ్డారు. అయితే వాటిస్థానంలో వాటికి బదులుగా మరోచోట మొక్కలు నాటుతామని ప్రభుత్వ అధికారులు భరోసా ఇచ్చారు. మొక్కలపై ఉన్న ప్రేమతోనే వనజీవి వారి కుమారులు, కుమార్తెతోపాటు మనుమలు, మనుమరాళ్లకు సైతం చెట్లపేర్లు పెట్టుకున్నాడు అంటే ఇతనికి హరితవనాల పట్ల ఉన్న ప్రేమ ఎంతటిదో తెలుస్తున్నది.



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

### నివాళి అర్పించిన ప్రముఖులు

పద్మశ్రీ వనజీవి రామయ్య మృతిపట్ల అనేక మంది ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, నారాచంద్రబాబు నాయుడు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, నారా లోకేష్, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ చంద్రావతి, సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజికవేత్తలు సోషల్ మీడియా వేదికల ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. రామయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళ్లులు అర్పించిన వారిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు పోతినేని సుదర్శన్, బాగం హేమంతరావు, జిల్లా అదనపు కలెక్టర్లు శ్రీనివాసరెడ్డి, డాక్టర్ పీ శ్రీజ, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీడబ్ల్యూజేఎఫ్ నేతలు ఇతర జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులు, సామాజికవేత్తలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# జాతరలా రజతోత్సవ సభ

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- దామరతోగులో సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రేగా కాంతారావు

గుండాల, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను పండుగ వాతావరణంలో జాతరలా జరుపుకోనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. దామరతోగు గ్రామంలో రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యమ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో పార్టీ రజతోత్సవాన్ని కేంద్ర పార్టీ అట్టహాసంగా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే రజతోత్సవ భహిరంగ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్లం భాస్కర్, కరకగూడెం మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, పార్టీ సీనియర్ నాయకులు సుతారి సత్యం, కుంజ నాగేశ్వరరావు, పాయం శ్రీను, గడ్డం వీరన్న, తాటి కృష్ణ, బొమ్మెర్ల శ్రీను, గొగ్గెల రాంబాబు, పొంబోయిన సుధాకర్, బొమ్మెర్ల పద్మారావు, సతీశ్, మోకాళ్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌ది అలుపెరుగని పోరాటం

- జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు
- రజతోత్సవ సభను విజయవంతం చేయాలని వాల్ రైటింగ్



మధిరలో వాల్ రైటింగ్ చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, ఏప్రిల్ 12 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ అలుపెరుగని పోరాటం చేశారని, ముఖ్యమంత్రిగా పదేళ్లు అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని తీర్చిదిద్దారని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. వరంగల్‌లో ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సిరిపురం గ్రామంలో వాల్ రైటింగ్ చేస్తూ శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కమల్‌రాజు బ్రష్ పట్టి కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు రాశారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ ప్రాణాలకు తెగించి పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లపాటు ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించారని, రైతులు, నిరుపేదల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే రజతోత్సవాలకు ఊరూరు నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, చిత్తారు నాగేశ్వరరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కనకపుడి బుచ్చయ్య, కోన నరేందర్‌రెడ్డి, గుర్రాల పెద్ద సైదిరెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శ్రీనివాస్‌రావు, పల్లపాటి కోటేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, పరిశ శ్రీనివాసరావు, రామాల ముక్కోటి, చారి, పెయింటర్ భాస్కర్, కనకపొడి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల అభివృద్ధి బీఆర్ఎస్‌దే..

- రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- 27న ఊరూరా పార్టీ జెండాలు ఎగురవేయాలని పిలుపు



రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 12 : రాష్ట్రంలో కనిపిస్తున్న అభివృద్ధి అంతా కేసీఆర్ పాలనలో పదేళ్లలో జరిగిందేనని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం సత్తుపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీ పరిధి, మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శనివారం నిర్వహించారు. తొలుత పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహించబోతున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రజతోత్సవం రోజు ఉదయం మున్సిపాలిటీలోని ప్రతీ వార్డు, ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాలు ఎగురవేయాలన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేంది కేసీఆర్, కేటీఆర్ మాత్రమేనని తెలిపారు. అనంతరం రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్లు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, వనమా వాసు, డీసీసీబీ డైరెక్టర్ మోదుగు పుల్లారావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు మోనార్క్ రఫీ, యాగంటి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు చాంద్‌పాషా, అద్దంకి అనిల్, నాయకులు పాల్గొన్నారు.

## 'గేటు' వద్ద నిర్మాణాలు వద్దు..

రైల్వే పనులు నిలిపివేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర ఏప్రిల్ 12 : పట్టణ ప్రజలు, చిరు వ్యాపారులకు ఇబ్బంది కలిగించే విధంగా పాత రైల్వే గేటు సమీపంలో చేపడుతున్న నిర్మాణాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని నిర్మాణ ప్రదేశంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణంతో గతంలో ఉన్న రైల్వే గేటును మూసివేయడంతో ప్రజలు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందన్నారు. వృద్ధులు, చిన్నారులు, ప్రయాణికులు పాత గేటు సమీపం నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, దీనికి రెండు వైపులా చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు దీనిని మూసివేస్తే ఇబ్బందికరంగా ఉంటుందని, మూడో లైన్ నిర్మాణంతోపాటు పాత గేటు సమీపంలో ప్రహరీ నిర్మిస్తున్నారని తెలిపారు. దీనిపై రైల్వే అధికారులకు, ప్రజాప్రతినిధులకు పాత గేటు సమీపంలో అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణం చేపట్టాలని అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి ఆర్‌యూబీ మంజూరయ్యే వరకు గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిత్తరు నాగేశ్వరరావు, బెజవాడ రవి, మల్లాది హనుమంతరావు, సూరంశెట్టి కిశోర్, మడుపల్లి గోపాలరావు, అరెగ శ్రీనివాసరావు, యన్నంశెట్టి అప్పారావు, పాపినేని రామనర్సయ్య, సేలం నరసింహారావు, మిరియాల రమణ గుప్తా, మందా సైదులు పాల్గొన్నారు. కాగా.. గోడ నిర్మాణం యథావిధిగా కొనసాగుతుందని, మూడు అడుగుల వెడల్పుతో రాకపోకలు సాగించేలా దారి ఏర్పాటు చేస్తామని రైల్వే ఏఈ ఆందోళనకారులకు హామీ ఇచ్చారు.


# మామిడి పండ్ల విక్రయానికి ప్రత్యేక మార్కెట్ : కలెక్టర్

రఘునాథపాలెం, ఏప్రిల్ 12 : ఖమ్మం జిల్లాలో రైతులు పండించిన మామిడి పండ్లను విక్రయించేందుకు ఒక ప్రత్యేక మామిడి పండ్ల విక్రయ మార్కెట్ ఉండాలనే ఉద్దేశంతో ఖమ్మం నగరం ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ పక్కన గల వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం తెలిపారు. రైతులు నేరుగా తాము పండించిన మామిడి పండ్లను మార్కెట్‌కు తీసుకొచ్చి వినియోగదారులకు అమ్ముకోవచ్చని సూచించారు. ఎలాంటి దళారుల ప్రమేయం ఉండదని, రైతులకు లాభదాయకంగా ఉండటంతోపాటు కొనుగోలుదారులకు క్వాలిటీ మామిడి పండ్లు అందుబాటులో ఉంటాయన్నారు. మామిడి తోట ఉన్న రైతులకు మాత్రమే మార్కెట్‌లో విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. కార్బైడ్‌రహిత మామిడి పండ్లను మాత్రమే అమ్మాలని సూచించారు. మార్కెట్‌లో విక్రయించే రైతులు తమ ప్రాంతాల్లోని ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించారు.

# నిలబడి పోరాడింది కేసీఆరే..

మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్న జనం

సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 12 : గత 24 ఏళ్లుగా ప్రజల పక్షాన నిలబడి పోరాడింది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ అని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరితో మొదలై నేడు లక్షల సంఖ్యలో దేశంలోనే ప్రజాభిమాన్ని చూరగొన్న పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రవేశపెట్టిన పలు పథకాలు దేశంలోనే చరిత్ర సృష్టించాయన్నారు. ఆయనను మళ్లీ సీఎంగా ప్రజలు, అన్ని వర్గాల వారు కోరుకుంటున్నారని అన్నారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ భారీ బహిరంగ సభకు ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉప్పెనలా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, జిల్లా నాయకులు సిలివేరు సత్యనారాయణ, దేవీలాల్‌నాయక్, రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, నాయకులు ఖమ్మంపాటి రేణుక, ఘాజీ, దాస్యం ప్రమోద్, జేకే శ్రీను, తోట లలిత శారద, కటకం పద్మావతి, కడకంచి పద్మ, సందా బిందు, ప్రవీణ్, నెమలి ధనలక్ష్మి, శీలం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు ప్రభంజనం చాటాలి

మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 12 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో పాలేరు నియోజకవర్గ ప్రజలు ప్రభంజనం చాటాలని మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి సాయి గణేష్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. 17న పాలేరు నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సన్నాహక సమావేశం, 27న జరిగే భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ 25 ఏళ్ల పండుగను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 17న జరిగే సన్నాహక సమావేశానికి మండల పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య, బాషబోయిన వీరన్న, మాజీ జడ్పీటీసీ గూడ సంజీవరెడ్డి, పలువురు సొసైటీ చైర్మన్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


ప్రకృతి ప్రేమికుడికి కన్నీటి వీడ్కోలు













